


19 వ వసంతంలోకి ...

సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం,28 అక్టోబర్ 2025

8 పేజీలు


# కాజ్ వేలు,కల్వర్టులు దాటకుండా పోలీస్ పికెట్లు

- జిల్లాలో పటిష్టంగా తుఫాన్ ముందస్తు చర్యలు
- తుఫాన్ పర్యవేక్షణ జోనల్ ప్రత్యేక అధికారి సిసోడియా





**ఏలూరు,మేజర్‌న్యూస్** : తూఫాన్ సమయంలో ప్రజలెవ్వరూ కాజ్‌వేలు,కల్వర్టులు దాటకుండా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,తుఫాన్ పర్యవేక్షణ జోనల్ ప్రత్యేక అధికారి ఆర్.పి.సిసోడియా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలో తుఫాన్ ముందస్తు చర్యలపై ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుఫాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్‌లతో కలిసి ఆర్.పి.సిసోడియా అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సిసోడియా మాట్లాడుతూ తుఫాన్ తీవ్రతపై రాష్ట్ర ముఖ్యమంత్రిస్పందించి రాష్ట్రంలో ఎక్కడా ఎటువంటి నష్టం సంభవించకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. తుఫాన్ మంగళవారం తీరందాటే అవకాశం ఉన్నందున ఆరోజు తీవ్రమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని,తుఫాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ,ఆస్థి నష్టాలు సంభవించకుండా అధికారులు ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు తుఫాన్

- తరువాయి 2లో..

# మొంథా తుఫాన్‌తో ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

- పునరావాస కేంద్రాల్లో బాధితులకు సౌకర్యాలు కల్పించాలి
- రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో 30 వేల టార్పాలిన్లు
- రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ,జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రిన్సిపాల్‌కార్యదర్శి,జిల్లా తుఫాన్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.శివ ప్రతాప్ శివ కిషోర్, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, ఏలూరు పార్లమెంటుసభ్యులు పుట్టామహేష్ కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కలసి జిల్లా అధికారులతో ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఎటువంటి ప్రాణ, నష్టం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. తుఫాన్ ప్రమాదం ముగిసే వరకు మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తుఫాన్ సహాయక కేంద్రాలకు తరలించాలన్నారు. సహాయక కేంద్రాలలో భోజన, వసతి సదుపాయాలుసక్రమంగా ఉండేలా చూడాలని, పరిసరాలు పరిశుభ్రత శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. తుఫాను బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చెయ్యాలని, ప్రభావిత ప్రాంతాల్లో నిత్యవసర వస్తువులునిల్వలు తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. తుఫాన్ సహాయక కేంద్రాలలో వైద్య శిబిరాలు

- తరువాయి 2లో..

# నేడు తీరం దాటనున్న తుఫాన్ - భారీ వర్షాలు కురిసే అవకాశం

- 13 మండలాల్లో పెనుగాలులు - 14 మండలాల్లో హై అలెర్ట్
- ప్రజలు,అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- తుఫాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** 'మొంథా' పెను తుఫాన్ ఈనెల 28వ తేదీ రాత్రిలోగా మచిలీపట్టణం- కళింగపట్నం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందని, ఆసమయంలో తీవ్రమైన వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి,తుఫాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం తీసుకున్న తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడలతో కలిసి తెలియజేసారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి నష్టం కలగకుండా

- తరువాయి 2లో..

# తుఫాన్ పట్ల అధికారులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప.గో.జిల్లా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్



**నరసాపురంమేజర్‌న్యూస్:** సోమవారం నరసాపురం నియోజకవర్గం తీర ప్రాంత గ్రామాలు అయినా పెద్దమైన వానిలంక,వేములదీవి, బియ్యపు తిప్ప, చిన్నమైనవానిలంక, పాతపాడు, కేపి పాలెం గ్రామాలలో జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించితుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా సముద్ర అలల

- తరువాయి 2లో..

# తుఫాన్ ఎదుర్కొనేందుకు ప.గో.జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు

- కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగా ఉంటే నష్టాన్ని తగ్గించుకోవచ్చు
- రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కోస్తా జిల్లాల తుఫాన్ పర్యవేక్షకులు సిసోడియా



**భీమవరం,మేజర్‌న్యూస్:**మొంథాతుపాను"నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో తుఫాను ఏర్పాట్లుపై జిల్లా యంత్రాంగంతో సమీక్షించేందుకు సోమవారం భీమవరం కలెక్టరేట్ చేరుకున్న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు కోస్తా జిల్లాల తుఫాన్ ప్రత్యేక పర్యవేక్షకులు ఆర్.పి సిసోడియా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీఅద్నాన్ నయీంఅస్మిలతో సంయుక్తంగా సమీక్షించారు. అనంతరం భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని జిల్లాలో తుఫాన్ ప్రభావాన్ని సమర్ధవంతంగా ఎదుర్కునేందుకు చేపట్టినచర్యలను ఆర్.పి సిసోడియా వివరించారు.

- తరువాయి 2లో..

# నేడు తీరం దాటనున్న తుఫాన్ - భారీ వర్షాలు కురిసే అవకాశం

**మొదటిపేజి తరువాయి**

జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకు న్నదన్నారు. ముంపు ప్రాంతాలలోని ప్రజలను తరలించేందుకు 82 తుఫాన్ సహాయక కేంద్రాలను గుర్తించడం జరిగిందని,వాటిలో కలిదిండి లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి 42 కుటుంబాలను తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో 301 మైనర్ ఇరిగేషన్ చెరువులుసమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందని,వాటిలో 129మైనర్ ఇరిగేషన్ చెరువులు ప్రమాదకరమైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. వీటి వద్ద సిబ్బందిని ఏర్పాటుచేసి, ప్రమాదానికి మించి నీటి ప్రవాహం వస్తే గండి కొట్టే చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు.తుఫాన్ సమయంలో పెను గాలులు వీచే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లాల్లో 763 హోర్డింగ్లు తొలగించడం జరిగిందన్నారు. తుఫాన్ ముంపు గ్రామాలలో 100 మంది గజఈతగాళ్లను సిద్ధం చేశామని,123 మంది గర్భిణీలను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. 11 లంక గ్రామంలో ప్రజలకు నిత్యావసర సరుకులు,ఆహార ధాన్యాలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కల్వర్టులు,కాజ్ వేల వద్ద రెవిన్యూ,పోలీస్ సిబ్బందిని పహారా ఉంచామన్నారు.జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మొంథా' పెను తుఫాన్ ప్రభావంతో మంగళవారం జిల్లాలోని 13 మండలాల్లో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.జిల్లాలోని 14 మండలాల్లో హై అలెర్ట్ ప్రకటించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో గాలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో జిల్లాలోని 763 హోర్డింగ్స్ ను తొలగించడం జరిగిందన్నారు.తుఫాన్ సమయంలో దెబ్బతిన్న విద్యుత్ పనుల పునరుద్ధరణకు గాను 2 వేల విద్యుత్ స్తంభాలు,500 ట్రాన్స్ఫార్మర్లు, 1200 మంది విద్యుత్ సిబ్బందిని అత్యవసర సేవల నిమిత్తం సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాన్ సహాయక చర్యలకు గాను 59 జేసీబీలు,37 చెట్లు కట్ చేసే యంత్రాలతోపాటు ఎస్డీఆర్ఎఫ్ బృందాను సిద్ధం చేయడం జరిగిందన్నారు.

## తుఫాన్ ఎదుర్కొనేందుకు ప.గో.జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు

**మొదటిపేజి తరువాయి**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆర్.పి సిసోడియా మాట్లాడుతూ మొంథా తుఫాన్ కాకినాడకు 500కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నదని,మంగళవారం రాత్రికి కాకినాడ మచిలీపట్నంల మధ్య తుఫాన్ తీరం దాటవచ్చు అన్నారు. తుఫాన్ సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థచాలాకీలకమైనదని, కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చు అన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. మొబైల్ టవర్ల వద్ద జనరేటర్లుఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం తుఫాను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు,26పక్కా భవనాలనుపునరావాస కేంద్రాల నిర్వహణకు సిద్ధం చేయడం జరిగింది, ఒక ఎన్డిఆర్ ఎఫ్ బృందం నరసాపురంలో సిద్ధంగా ఉందన్నారు.68 జేసీబీలు, 57 పవర్ సాసర్లు సిద్ధం చేయడం జరిగింది న్నారు.లోతట్టు ప్రాంతాలు,తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో నీటి తొలగింపు చర్యలను పక్కాగా నిర్వహించాలన్నారు. గర్భిణీ స్త్రీలను, వృద్ధులను స్థానిక పీహెచ్సీలకు తరలించడం జరిగిందన్నారు. తుఫాన్ తీవ్రతను బట్టి 90 నుండి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, డివైడర్ల మధ్యలో హోర్డింగ్స్ను తొలగించాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రోడ్లమీద ప్రైవేట్ వెహికల్స్ తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కి ఆదేశాలు జారీ చేశారు.పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం పాల్గొన్నారు.

## ప్రైవేటు బస్సులు తనిఖీ చేసిన ప్రాంతీయరవాణా అధికారి అన్నపూర్ణ



**ఆగిరిపల్లి,మేజర్న్యూస్:** ఆగిరిపల్లి మండల పరిధిలో నూజివీడు ప్రాంతీయ రవాణా అధికారిణి అన్నపూర్ణ సోమవారం ప్రైవేటు బస్సులను తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా రవాణా అధికారిణి అన్నపూర్ణ మాట్లాడుతూ ఇటీవల కర్నూల్ ప్రాంతంలో జరిగిన భారీ అగ్ని ప్రమాద నేపథ్యంలో ఉన్నతాధి కారుల ఆదేశం మేరకు ప్రైవేట్ బస్సులలో నిబంధనల మేరకు విస్తృత తనిఖీలు చేపట్టినట్లు, నిబంధన పాటించని ప్రైవేటు బస్సులపై ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా కఠినంగా వ్యవహరిస్తూ, భారీ జరిమానాలు విధిస్తామని అన్నారు.

## భీమడోలు మండల వ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు





**భీమడోలు,మేజర్న్యూస్:** కార్తీకమాసం తొలి సోమ వారం సందర్భంగా భీమ డోలు వ్యాప్తంగా శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. శ్రీభీమేశ్వర స్వామి ఆలయం, పొలసానిపల్లి శ్రీరామలింగేశ్వరస్వామి ,గుండుగొలను శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి, అంబరుపేట శ్రీఉమారామలింగేశ్వరస్వామి, పూళ్ల సకలేశ్వరస్వామి ఆలయాల వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు .. విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.. ఆలయ ఆవరణలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. భీమడోలు లోని శ్రీపార్వతి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కాళ్లకూరి ఉమా విజయ శంకర శర్మ స్వామి వారికి విశేష పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేసారు.

## నవంబరు 2వ తేదిన తెప్పోత్సవానికి ఏర్పాట్లు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** స్థానిక చిన్నమ్మా రావు పేటలో ఉన్న శ్రీవారి నృసింహ సాగర్లో ప్రతి ఏటా క్షీరాబ్దిద్వాదశినాడు స్వామివారి తెప్పోత్సవం నృసింహసాగర్లో నిర్వహిస్తారు.ఈ నేపథ్యంలో చెరువులో ఉన్నకాడను తొలగించిశుభ్రం చేశారు .స్వామివారిని అమ్మవార్లను హంస ఆకృతిలో ఉన్నతేప్పపైన ఈవేడుకను నిర్వహిస్తారు. భక్తులు ఈ వేడుకను తిలకించి ఎంతో మహాభాగ్య గా భావిస్తారు.దీంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు.దీనిలో భాగంగా నవంబర్ 2వ తేదీన స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్నారు.ఇందుకు సంబంధించిన అన్నిఏర్పాట్లను అధికారులు చేపట్టారు.

## పునరావాస శిబిరానికి సంచారజాతులు



**కామవరపుకోట,మేజర్ న్యూస్:** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కామవరపుకోట శ్రీ వీరభద్ర స్వామి కోటగట్టు ప్రాంగణంలో టెంట్లు వేసుకున్న సంచారజాతుల వారిని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. సోమవారం మండల ప్రత్యేక అధికారి కేవి. సుబ్బారావు,ఎంపీడీవో ఎం. సరళకుమారి వీరిని హైస్కూల్ పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి అక్కడ అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ప్రత్యేక అధికారి సుబ్బారావు గ్రామ పంచాయతీ కార్యదర్శి, విలేజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

## నిబంధనల ప్రకారమే మద్యం షాపులు




**నర్సాపురం,మేజర్న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ రూల్ ప్రకారం నర్సాపురం ఎక్సైజ్శాఖ పరిధిలోని మద్యం షాపులు,బార్లు నిర్వహిస్తున్నారని నిబంధనలను అతిక్రమించి ఎక్కడా జరగటం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంబాబు తెలిపారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నరసాపురం పరిధిలోని 27 మద్యం షాపులు, రెండుబార్లను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.బెల్ట్ షాపులు కూడా ఎక్కడ నిర్వహించటం లేదని, అంతా పారదర్శకంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ హైవే పక్కన మున్సిపాలిటీ స్థలంలో దత్తు బార్ అండ్ రెస్టారెంట్ కొనసాగుతుందని, కళాశాలకు 100 మీటర్ల దూరంలో ఉన్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి రాత్రి పది గంటల వరకు అనుమతులు ఉన్నాయని, మొగల్తూరు మండలం రామన్నపాలెం లో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉండటంతో ఆ ప్రాంతా న్ని తనిఖీ చేసామని ఎటువంటిఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. గతంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న 147 మందిపై బైండోవర్ కేసులు పెట్టి తాసిల్దార్ ముందు హాజరపరచమని సిఐ తెలిపారు.

## కాజ్ వేలు,కల్వర్టులు దాటకుండా పోలీస్ పికెట్లు

**మొదటిపేజి తరువాయి**

ప్రమాదం తొలగిపోయే వరకు వారికి కేటాయించిన ప్రదేశాలనే నివాసం ఉండి, తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిలాల్లో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ప్రాంతాలకు సంబందించిన ప్రజలకు 82 సహాయక కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని,కలిదిండిలోఒకతుఫాన్ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.జిల్లాలోశిధిలావస్థలోఉన్న భవనాలు, పూరిళ్లలో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసవ సమయానికిదగ్గరలో ఉన్న గర్భిణీలను దగ్గరలోని పిహెచ్సి లకు తరలించాలన్నారు. జిల్లాలో బలహీనంగా ఉన్న హోర్డింగ్లు, స్తంభాలను గుర్తించి కూల్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో తుఫాన్, తీవ్రగాలులు పై ప్రజలకు అవగాహన కల్పించి రానున్న మూడు రోజులపాటు ప్రజలు బయటకు రాకుండా అప్రమత్తం చేయాలనీ, ప్రజలు మూడు రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, ఆహార ధాన్యాలు, త్రాగునీరు వంటివి ఉంచుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని 11 లంక గ్రామాలు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామని, ఆయా గ్రామాలలో ఆహారం, వైద్య, త్రాగునీరుకి సమస్య లేకుండా చూడాలన్నారు. తుఫాన్ సహాయక కేంద్రాలలో భోజన,వసతి, వైద్య సదుపాయాలు ఉండేలా చూడాలని కోరారు. ఐటిడిఏ పిఓ రాములు నాయక్, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు,ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్తో ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

**మొదటిపేజి తరువాయి**

ఏర్పాటుచేసి, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లాలో రైతుసేవా కేంద్రాల్లో టర్పాయిన్లు సిద్ధం చేశామని కావాల్సిన రైతులకు అందజేయాలనిఅన్నారు. సమాచార వ్యవస్థ సేవలలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని, సెల్ టవర్స్ దగ్గర ఏర్పాటు చేసిన జనరేటర్లుకు సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా డీజిల్ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని, సమాచార వ్యవస్థ బాగుండేలా అన్నిచర్యలు తీసుకోవాలని అన్నారు. కాలువలు,ఆనకట్టలు, డ్రైనేజీ ఎప్పటికప్పుడు పరిశీలనచేయాలని అన్నారు. హోర్డింగ్లులేకుండా చూడాలని, ఉన్నవి తొలగించాలని అన్నారు.అన్ని శాఖలు సమన్వయంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తుఫాన్ను సమర్థవంతంగా ఎదుర్కొనాలని మంత్రి చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## తుఫాన్ పట్ల అధికారులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజి తరువాయి**

ఉధృతిని పరిశీలించారు.స్థానికులతో మాట్లాడారు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. పునరావాస కేంద్రాలలోఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైతే పరిస్థితిని బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో బాధితులకు భోజన వసతితో పాటు త్రాగునీరు, టాయిలెట్స్, పారిశుధ్యం,విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖలు సిబ్బంది ఎటువంటి విపత్తు సంభవించిన ఎదుర్కొనుటకు సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందనిఅన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన కంట్రోల్ రూమ్ కు సమాచారమును అందించాలని అన్నారు. అలాగే మత్స్యకారులు సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తీరంలో అగ్నిమాపక, ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తీరందాటే సమయంలో భారీ వర్షాలతో పాటు వేగముగా గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు బయటకు రాకుండా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో సురక్షితముగా ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,ఆర్డీవో దాసిరాజు నరసాపురం మండలం వేములదీవి పడమర చినమైన వానిలంక గ్రామంలో శిధిలావస్థలో ఉన్న నల్లి క్రీక్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంలో జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, తహసిల్దారులు ఐతం సత్యనారాయణ, రాజ్ కిషోర్, కనకరాజు, ఎంఎస్ పాజిల్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# తుపాను ముప్పు నేపథ్యంలో ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

**- అధికారులకు జిల్లా ఎస్‌పి,డిఎస్‌పి,ఆర్‌డిఓ సూచనలు**



**నూజివీడు,మేజర్ న్యూస్:** తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా నూజివీడులో జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ,నూజివీడు ఆర్డీఓ వినూత్న ,డిఎస్పి కె వి వి ఎన్ వి ప్రసాద్ మొగల్ చెరువు వద్ద క్షేత్రస్థాయి పరిశీలన చేసి ప్రజలకు రక్షణ చర్యలు తీసుకొనే విషయములో అధికారులకు తగిన సూచనలు సలహాలు,ఆదేశాలు ఇచ్చారు. ఏలూరు జిల్లాలో వాతావరణంలో సంభవిస్తున్న ఆకస్మిక మార్పులు, రాబోయే తుపాను ముప్పు నేపథ్యంలో, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై, ముందస్తు చర్యలు ముమ్మరం చేసింది.జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్,ఆర్డీఓ వినూత్నతో పాటు నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ పోలీస్,ా రెవెన్యూ అధికారుల బృందంతో కలిసి నూజివీడు ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. అధికారులు బృందం ముఖ్యంగా నూజివీడులోని మొగల్ చెరువు పరిసర ప్రాంతాలు, తుపాను ప్రభావానికి గురయ్యే లోతట్టు ప్రాంతాలను పరిశీలించింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు భయాందోళన చెందకుండా, అధికారులు చెప్పే సూచనలు, హెచ్చరికలు తప్పక పాటించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా యంత్రాంగం,వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు, సమాచారాన్ని రేడియో,టీవీ లేదా విశ్వసనీయ సోషల్ మీడియా ద్వారా నిరంతరం తెలుసుకుంటూ ఉండాలి. టార్చిలైట్, బ్యాటరీలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టె, త్రాగునీరు, పాడవ్వని ఆహార పదార్థాలు (బిస్కెట్లు, ఉప్పు, పంచదార, పప్పులు), ప్రాథమిక చికిత్స కిట్,ముఖ్యమైన మందులు, నగదు వంటివాటిని సిద్ధం చేసుకోవాలి. పత్రాలు, విలువైన వస్తువులు: ముఖ్యమైన పత్రాలు (రేషన్ కార్డు, ఆధార్, బ్యాంక్ డాక్యుమెంట్లు) విలువైన వస్తువులను వాటర్‌ప్రూఫ్ బ్యాగుల్లో భద్రపరుచుకోవాలి.

లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండేవారు, అధికారులు ఏర్పాటు చేసిన సురక్షిత శిబిరాలకువెంటనే తరలివెళ్లాలని సూచించారు. సహాయం కోసం సంప్రదించండి పోలీస్, విపత్తు నిర్వహణ హెల్ప్ లైన్ డయల్ 112 లేదా జిల్లా యంత్రాంగం ప్రకటించిన ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్ అగ్నిమాపక శాఖ: 101 తెలియ చేశారు.

# మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎమర్జెన్సీ రిస్క్ టీమ్‌లు,2 వాహనాలు ఏర్పాటు




**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** ఈ వాహనములు పాలకొల్లు పట్టణంలోనీ అన్ని వార్డుల్లో పర్యవేక్షించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నంరెండు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు, రాత్రి పది గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మూడు బృందాలుగా ఏర్పడి 24/7 పెట్రోలింగ్ చేయడం జరుగు తుందన్నారు. సమయంలోనైనా ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలిగిన వాహనంలో పునరావాస కేంద్రములకు తరలించడం జరుగుతుందని అన్నారు. పాలకొల్లు పట్టణం 10,11 వార్డులు సంబంధించిన సచివాలయమును సందర్శించారు. వార్డు ప్లాన్ లను పరిశీలించారు. పట్టణంలో మురుగునీరు ప్రవహించే దమయంతి మెయిన్ డ్రెయిన్ పరిశీలించారు. డ్రెయిన్ లో ఏ విధమైన ఆటంకాలు లేకుండా మురుగునీరు పారుదల సక్రమంగా ఉండటంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం తాహసిల్దార్ కార్యాలయమును సందర్శించి వర్షపాతం పరిమాణాన్ని తెలిపే సాధనమును పరిశీలించారు.వర్షపాతం ఎంత నమోదు అయినది వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంలో తహసిల్దార్ వై.దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ కె.విజయ సారథి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**పెడవేగి,మేజర్‌న్యూస్ :**కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పరిష్కరించుకొని పెదవేగి మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.ఈ సందర్భంగా మండల కేంద్రమైన పెదవేగి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ పార్వతీ సమేత పరమేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నాలుగు గంటల నుండి స్వామివారికి గణపతి పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు నిర్వహించడం జరిగిందని ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. అలాగే భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని అన్నారు. పెదవేగి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు.

# ఆస్తి ప్రాణ నష్టం నివారణకు ప్రజలు సహకరించాలి



**- డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి**

**- అందుబాటులో డీఎస్పీ స్థాయి అధికారులు : ఎస్పీ**

**కైకలూరు,మేజర్‌న్యూస్ :** తుపాను హెచ్చరిక: కైకలూరు, పెదపాడుప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా ఆస్తి, ప్రాణ నష్టం నివారణకు ప్రజలు సహకరించాలి అని ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి జిల్లాలో తుపాను, భారీ వర్షాలు మరియు ఈదురు గాలుల నేపథ్యంలో, జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, ప్రజలు ఎవరూ కూడా అవసరాలు లేకుండా బయటకు రాకూడదని ఆయన కోరారు. పెదపాడు మండలం మరియు కైకలూరు నియోజకవర్గాల్లోని చేపలు, రొయ్యల చెరువుల యజమానులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.చేపలు/రొయ్యల చెరువుల వద్ద షెడ్లలో నివాసం ఉంటున్న కాపలాదారులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కాపలాదారులకు ఏదైనా ప్రమాదం సంభవించినా లేదా ప్రాణనష్టం జరిగినా, దానికి సంబంధించిన పూర్తి బాధ్యత ఆ చెరువుల యాజమాన్యాలదే అవుతుంది. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. నగరాలు, గ్రామాలలోని పెద్ద పెద్ద హోర్డింగ్‌లు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున, వాటిని వెంటనే తొలగించాలని ఎస్పీ ఆదేశించారు.ఎవరైనా యజమానులు నిర్లక్ష్యం వహించి, హోర్డింగ్‌ల వలన ప్రమాదం సంభవిస్తే, ఆ హోర్డింగ్‌ల యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట నుంచి వచ్చిన డీఎస్పీ స్థాయి అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎస్పీ తెలియజేశారు. ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారులకు సహకరించి, వారి సూచనలను పాటించాలని, అత్యవసరమైతే డయల్ 112ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ పాటుగా కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ , కైకలూరు రూరల్ ఇన్స్పెక్టర్ వి రవికుమార్ , కైకలూరు టౌన్ ఎస్సైలు వెంకట్ కుమార్,ఆర్ శ్రీనివాస్ కైకలూరు ఎస్సై రాంబాబు,కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు,మండవల్లి ఎస్సై రామచంద్ర రావు,ముదినేపల్లి ఎస్సై వీరభద్ర రావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే రాధాకృష్ణ**



**తణుకు,మేజర్‌న్యూస్ :** ముంచుకొస్తున్న ముంథా తుఫాను నేపథ్యంలో తణుకు నియోజక వర్గంలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. సోమవారం తణుకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తణుకు నియోజవర్గంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఎమ్మెల్యే రాధాకృష్ణ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ తీరం వద్ద తుఫాను తీరం దాటుతున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అధికారులు అంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తణుకు పట్టణంతోపాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తణుకు నియోజవర్గంలోని ఎక్కడైనా చెట్లు కూలిపోతే తక్షణమే వాటిని తొలగించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు రానీయకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని కోరారు..

# శ్రీ వీరభద్ర అన్నదాన కమిటీ సేవలు అమోఘం



**కామవరపుకోట, మేజర్‌న్యూస్:** శ్రీ వీరభద్ర అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అమోఘమని కామవరపుకోట మండల టీడీపీ సీనియర్ నాయకులు మద్దిపోటి నాగేశ్వరరావు అన్నారు. శ్రీ వీరభద్ర అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో కామవరపుకోట శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి వారి ఆలయంలో మాల ధారణ చేసిన స్వాములకు జరుగుతున్న భిక్ష కార్యక్రమాలు సోమవారం తో 25వ రోజుకుచేరుకున్నాయి. ఈభిక్షా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ మద్ది పోటి నాగేశ్వరరావు భిక్ష వడ్డనలో పాల్గొన్నారు. గత తొమ్మిదేళ్లుగా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భిక్షలు నిర్విరామంగా జరుగుతున్నాయంటే కమిటీ సభ్యులు కృషి ఎంతైనా ఉందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన కమిటీలో తాను కూడా సభ్యుడుగా ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం భిక్షా కార్యక్రమాలకు గాను వంట సామగ్రి నిమిత్తం రు. 10వేలను అన్నదాన కమిటీ సభ్యులకు అందజేశారు. సోమవారం నాటి బిక్షలను మీసాల రాజు,కాకిగోపాలం,పరసశ్రీను ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రభుత్వ విప్ నాయకర్‌ను కలిసిన బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు



**నరసాపురం,మేజర్ న్యూస్:** స్థానికజనసేన పార్టీ కార్యాలయంలో సోమవారంరాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు కరిమదల భాస్కరరావు (కర్నూలు),బెస్త శ్రీనివాస్ (ధర్మవరం)లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భముగా ప్రభుత్వ విప్ నాయకర్ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లుగా పదవులు పొందిన వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని, ప్రత్యేకంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, నిప్పులేటి తారక రామారావు, దేశినీడి గంగాధర్, వాతాడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

: విప్ నాయకర్,రామరాజు



**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ప్రభావంతో తీరప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రభుత్వ విప్,నరసాపురం శాసనసభ్యులుబొమ్మిడి నాయకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయని,అన్నిశాఖలు అలర్ట్‌లో ఉన్నాయని, పరిస్థితిని దగ్గరగా పర్యవేక్షిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని, విద్యుత్ స్తంభాలు, వైర్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పేరుపాలెం, పీఎంలంక, బియ్యపుతిప్ప, చినలంక గ్రామాల తుఫాన్ షెల్టర్లను సందర్శించి, ప్రజలతో మాట్లాడి అవసరమైన సహాయం అందించేందుకు అధికారులను ఆదేశించారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, పిల్లలు-వృద్ధులు ఇంట్లోనే ఉండాలని ప్రజలను కోరారు. "ప్రజల భద్రతే ప్రాధాన్యం. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి" అని నాయకర్, రామరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ తుఫాన్ సమయంలో టిడిపి, జనసేన, బీజేపీ కార్యకర్తలు ముందుండి సహాయక చర్యల్లో పాల్గొనాలి అని వారు పిలుపునిచ్చారు.


## లక్కీ డ్రాలు,స్కీంల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఐకి ఎంపి పుట్టా మహేష్ కుమార్ ఆదేశం



**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ తమిర్ని బ్రహ్మయ్య చేసిన నకిలీ లక్కీ డ్రా మోసంపై రాజవరం గ్రామంలో కొంతమంది మహిళలు కలిసి ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్‌కి ప్రజా దర్బార్ లో ఫిర్యాదు చేసారు. రాజవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ అనుమతులు లేకుండా, అమాయక మహిళలకు మాయమాటలు చెప్పి లక్కీ డ్రాలో డబ్బులు కడితే మీకు ఎక్కువ డబ్బులొస్తాయి లేదా డ్రెస్సింగ్ టేబుల్,దివాన్ మంచం,ఏ.సి,గోల్డ్ ఇంకా అనేక వస్తువులు వస్తాయని చెప్పి వందల రూపాయల నుండి వేల దండి కుంటూ తీరా ప్రైజ్ వచ్చేసరికి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు మహిళలు ఆరోపించారు. కొయ్యలగూడెం మండల చుట్టూ ప్రక్కల గ్రామాలలో సుమారు 500 మందితో వాట్స్ గ్రూప్ లతో ఈ స్కీం నడుపుతూ సుమారు కోటి రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపించారు. వెంటనే స్పందించిన పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేష్ కుమార్ కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి నిర్వాహకుడిపై తగు చర్యలు తీసికొని బాధితులందరికీ వెంటనే నష్టపోయిన డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## తుఫాన్ పరిస్థితులపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఎంపీ



**ఏలూరు,మేజర్‌న్యూస్:** మొంథా తుఫాన్ పరిస్థితులపై మండల పార్టీనాయకులు, క్లస్టర్ ఇన్చార్జ్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ప్రజలకు అందుబాటులో ఉండి,అవసరమైన చోటసహాయ చర్యల్లో పాల్గొనాలని స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సహాయం అవసరమైనా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కు, లేదా ఎంపీ కార్యాలయానికి కాల్ చేయవలసిందిగా సూచించారు ఎంపీ ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశామని, వారంతా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండి, సహాయ చర్యల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఏలూరు పార్లమెంట్ పరిధిలోని పలు మండలాలకు చెందిన నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

# మొంథా తుపాను సందర్భంగా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్



- సంప్రదించాల్సిన నెంబర్ 08816 299219

: జిల్లా కలెక్టర్ నాగరాణి

**భీమవరం,మేజర్ న్యూస్ :** మొంథా తుపాను" నేపథ్యంలో కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం పరిశీలించి కంట్రోల్ రూమ్ కు ప్రజల నుండి వచ్చిన కాల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురియనున్న దృష్ట్యా కంట్రోల్ రూమ్ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు,మండల కార్యాలయాలలో కూడా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజనల్, మండల స్థాయి కంట్రోల్ రూమ్ ల నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురి కావడం, చెట్లు పడిపోవడం, నిత్యవసర వస్తువుల కొరత, విద్యుత్ అంతరాయాలు, పునరావాస కేంద్రాల వద్ద త్రాగునీరు, శానిటేషన్, వైద్య సహాయం తదితర సమస్యలపై ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి సంబంధిత సమాచారాన్ని ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. తుఫాను తీరందాటి పరిస్థితులు చక్కబడే వరకు 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. సందర్భంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి,డిఆర్ఓ బి.శివనారాయణ రెడ్డి, గ్రామ,వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## జంగారెడ్డిగూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా జంగారెడ్డి గూడెం పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. మున్సిపల్ కార్యక్రమంలో ఆమె విలేకరుల సమావేశం మాట్లాడారు. సోమవారం పట్టణంలో భారీ హోర్డింగ్ లు వెంటనే తీసి వేయాలని,లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలని ,చెరువుల దగ్గర ఉన్న ప్రజలని పునరావాస కేంద్రాలు మార్చాలని, చైర్ పర్సన్ నాగలక్ష్మి కమిషనర్,ఏఈ,శానిటరీ ఇన్స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ వారిని ఆదేశించారు. సోమవారం చైర్ పర్సన్ ఛాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం పట్టణంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి), కమిషనర్ కె.వెంకట రమణ, కౌన్సిలర్లు చిటికెల అచ్చుత రామయ్య,దొంతు మాధన్ రాజు, బత్తిన చిన్నా,టిపిఓ,ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో చర్యలు : ఎంపిడిఓ



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** మండలంలోని 18 గ్రామాలకు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రత్యేక అధికారులను నియమించి,అన్ని ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తో పర్యవేక్షణ చేస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో ఎన్.ఎస్.జె. కృష్ణ మూర్తి తెలిపారు. సోమవారం ఉదయం నెగ్గిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సభ్యులతో తుపాన్ నుండి ఎలా రక్షణ పొందాలన్న విషయం మీద అందరికి సూచనలు చేశారు.

అధిక వర్షాలకు పాత,పాడు బడిన గృహాలు కూలి పోయే ప్రమాదం ఉన్నందున వాటిని ఖాళీచేయించి,సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ.పి.ఆర్డి వల్లభు రాంబాబు,గ్రామ ఉపసర్పంచ్ అల్లం బాలసాయి రెడ్డి, కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆక్యుపేషనల్ థెరపీ డే పై అవగాహన



**ఏలూరు,మేజర్ న్యూస్:** దొండపాడులో గల ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ స్పెషల్ డి.ఎడ్. కాలేజి నందు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారు సోమవారం ప్రపంచ ఆక్యుపేషనల్ థెరపీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ డి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ ఆక్యుపేషనల్ థెరపీ డే థీమ్: ఆక్యుపేషనల్ థెరపీ ఆచరణలోఅని వృత్తి చికిత్స సేవలు అన్ని వయసుల వారికి వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళికల ద్వారా శారీరక, ఇంద్రియ,అభిజ్ఞా సవాళ్లను పరిష్కరించడం ద్వారా రోజువారీ పనులను నిర్వహించడానికి సహాయపడతాయి. ఈ సేవలలో మూల్యాంకనాలు,జోక్య ప్రణాళిక ,డ్రెస్సింగ్,వంట వంటి రోజువారీ జీవన కార్యకలాపాలకు నైపుణ్యాలను మెరుగుపర చడానికి చికిత్స, అలాగే సహాయక సాంకేతికత, గృహ మార్పులను సిఫార్సు చేయడం ఉన్నాయి అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, స్పెషల్ డి.ఎడ్. కాలేజి సిబ్బంది, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# వృద్ధులు,చిన్నారులతో గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ దీపావళి వేడుకలు





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** జీవన సంధ్య వృద్ధాశ్రమంలో నివసిస్తున్న 70 మంది వృద్ధులు,స్వాభిమాన్ చిల్డ్రన్ హోమ్ నుండి 70 మంది చిన్నారులతో మదర్లీ గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆనందోత్సాల మధ్య దీపావళి వేడుకలు నిర్వహించినట్లు ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ,ట్రస్టి చెన్నా జనర్ధనరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జీవన సంధ్య వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు జరిగాయి. పిల్లలు వృద్ధులతో వారి పూర్వపరాలు,ఆరోగ్యం,శ్రేయస్సు గురించి తెలుసుకుంటూ వారితో సంభాషించారు. దీపావళి జరుపు కోవడానికి పిల్లలతో సమయం గడపడానికి వృద్ధులు ఏడాది పొడవునా వేచి ఉన్నారు.ఏకాంతంలో ఒంటరితనంతో వృద్ధులు కన్నీటి పర్యంతమయ్యారు. పిల్లలు,వృద్ధుల చేతులు పట్టుకున్నప్పుడు వారిలో ఆనందభాష్పాలు కనిపించాయి.ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు 8,220 రూపాయలు,వాసవి డిగ్రీ కళాశాల విద్యార్థులు 700 రూపాయలు విరాళంగా ఇచ్చారు.యుఎస్ఎ నుండి రాధిక 10వేల రూపాయలు విరాళం అందించారు. పిల్లలను స్వాభిమాన్ నుండి జీవన సంధ్య వృద్ధాశ్రమానికి తీసుకెళ్లడానికి బస్సును వాసవి డిగ్రీ కళాశాల ఇచ్చింది.ఈ కార్యక్రమాన్ని సాధ్యం చేసినందుకు ఓపి.గోయెంకా,సీమా గోయెంకా,స్వాభిమాన్ బృందానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. చెన్నా త్రికళ ,బ్రహ్మజీ, చెన్న జనార్ధన్, కేశవ వర్మ, దుర్గా వర ప్రసాద్, రవితేజ, కొండా,తేజ,మున్నా జీవన సంధ్య బృందం అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులు ఒంటరిగా ఉన్నారని, మీ సందర్శనలు, ఉనికి వారిని నయం చేయగలవని, తాడేపల్లిగూడెం నుండి విద్యార్థులు, స్థానిక ప్రజలు తమ కుటుంబాలతో కలిసి వృద్ధాశ్రమాన్ని సందర్శించాలని అభ్యర్థిస్తున్నామని అన్నారు. ట్రస్టి జనార్దన్ రావు మాట్లాడుతూ దీపావళి వేడుకలు ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ వారి స్వాభిమాన్ ఆశ్రమానికి చెందిన సుమారు 75 మంది పిల్లలతో,వృద్ధులతో కలిసి పిల్లలు అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యలతో కలసి ఐకమత్యంగా సంతోషంగా జరుపుకున్నారు.వృద్ధులు తమ కుటుంబ సభ్యులకు చెందిన మనుమళ్ళతో సంతోషంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలని ఎంతో ఆనందాన్ని పొందారు.

ఈ కార్యక్రమానికి సహకరించిన ఫుట్ పాడ్స్ ఇండస్ట్రీస్ వారికి వాసవి డిగ్రీ కాలేజ్ వారికి దాతలు రాధికకి ఆదిత్య కాలేజ్ స్టూడెంట్స్‌కి వాసవి కాలేజ్ స్టూడెంట్స్‌కి బ్రహ్మజీకి పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మదర్లీ గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ,ట్రస్టి చెన్నా జనర్ధనరావు తెలిపారు.

# వరి సస్యరక్షణకు చర్యలు చేపట్టిన వ్యవసాయ శాఖ అధికారులు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** అధిక వర్షాలతో మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లో స్వర్ణ ,సంపద స్వర్ణ రకాల వరి పంటలు పొలాలను సోమవారం ఆచార్య ఎన్ జి రంగా,వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం,ఏలూరు శాస్త్రవేత్త ఎం.నాగేంద్ర బాబు,మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో వరి పంటలలో సంక్షిప్త క్షేత్ర సందర్శన చేపట్టడం జరిగింది. అధిక వర్షాలకు వరి పంట పడిపోవటాన్ని వారు గమనించారు. ప్రస్తుతం వరి పంట పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టి పడే దశలో ఉంది. ఈ నేపథ్యంలో మండల వరి రైతాంగం గింజ రంగు మారకుండా సస్యరక్షణ చేయటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అధిక వర్షాలకు పడిపోని ఎంటియు 13 18 వరి రకాన్ని సాగు చేసుకోవాలని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో పేరంపేట, పంగిడిగూడెం, రైతు సేవా కేంద్రం సిబ్బంది, నాయక్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

# 'మొంథా' తుఫాను ప్రభావిత 12 జిల్లాల్లో పౌర సరఫరాల శాఖ తరపున అన్ని ఏర్పాట్లు

**– రాష్ట్రంలో 14,145 రేషన్ డిపోలు ద్వారా 7లక్షలు రేషన్ కార్డు కుటుంబాలకు నిత్యా వసర సరుకులు పంపిణీకి చర్యలు**

**– రాష్ట్ర మంత్రి,జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్**



**ఏలూరు,ఉమ్మడి ప గో.జిల్లా సూర్య బ్యూరో :** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో సోమవారం రాష్ట్రంలో 'మొంథా' తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలుపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్ పాత్రికేయులు సమావేశాన్ని నిర్వహించారు.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 'మొంథా' తుఫాను ప్రభావిత 12 జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో పౌర సరఫరాలు శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి మొత్తం 12 జిల్లాలో యుద్ధప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఈ జిల్లాల్లో 14,145 రేషన్ డిపోలు ద్వారా 7 లక్షలు కార్డు దారులు కుటుంబాలకు నిత్యవసర సరుకులు సబ్సిడీ రూపంలో రేపు ఉదయం 9:00 గంటలు నుండి అందిస్తున్నామని అన్నారు. మొంథా తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు జిల్లాలో టార్పాలిన్లు రైతు సేవా కేంద్రాల్లో ఉంచామని రైతులు వాడుకోవచ్చునని తెలిపారు. ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 626 వివిధ కంపెనీల బంకులలో 35,443 లీటర్లు డీజిల్ ఆయిల్, పెట్రోల్ అదనంగా నిల్వలను అందుబాటులో ఉంచి, కొరత లేకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న 1,500 మిల్లులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు నుంచి తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇప్పటికే కోత కోసిన వరి ధాన్యం వ్యవసాయ అధికారుల సహకారంతో పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత ఏడాది మాదిరిగానే టార్పాలిన్లు, తాళ్లు, ఇసుక సంచులు, ప్లాస్టిక్ట్ షీట్లు అందుబాటులో ఉంచామని అవసరాన్ని బట్టి వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమాచార వ్యవస్థలో ఏటువంటి అంతరాయం లేకుండా చూడాలని, సెల్ టవర్స్ దగ్గర ఏర్పాటు చేసిన జనరేటర్లుకు సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా డీజిల్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని, సమాచార వ్యవస్థ బాగుండేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

## మడకశిరలో పర్యటించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



**మడకశిర/జంగారెడ్డి గూడెం,మేజర్ న్యూస్ :** అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గ కేంద్రంలో సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మడకశిరలో శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్, వరవరరావు నేతృత్వంలో దళిత శాసనసభ్యులు,శాసనమండలి సభ్యులు సమావేశమయ్యారు.

## తడిసి ముద్దయిన విప్ నాయకర్ :

### తీర ప్రాంతంలో విస్తృత పర్యటన



**నర్సాపురంరూరల్,మేజర్ న్యూస్:** తుఫాను ప్రభావంతో ఆందోళనకు గురవుతున్న తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ధైర్యం చెప్పారు. సోమవారం ఉదయం నుండే తీర ప్రాంత గ్రామాలైన బియ్యపు తిప్ప, వేములదీవి ఈస్ట్, పీఎం లంక, మొగల్తూరు మండలంలోని పాలు తీర ప్రాంత గ్రామాల్లో ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బంది అయినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఎవరూ అధైర్య పడవద్దు అన్నారు. సుమారు 15 వేల మందికి పునరావసం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటే మరింత మందిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ తుఫాను సీరియస్గా తీసుకున్నదని, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసిందన్నారు.

నర్సాపురం నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారన్నారు. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని బయటకు రావద్దన్నారు. తుఫాను ప్రభావంతో విస్తారంగా గాలి వేసే అవకాశం ఉన్నదని బయటకు వెళితే ఇబ్బందులు ఎదురవుతాయి అన్నారు. ఉదయం నుండి వర్షం కురుస్తున్నప్పటికీ తడుస్తూనే ఉత్తర ప్రాంత గ్రామాల్లోని ప్రజల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. నేనున్నాను మీకు ఏమీ కంగారు లేదు మీరు మాత్రం ఇంటి నుంచి బయటకు రావద్దు. ఏమైనా ఇబ్బంది ఉంటే నాకు నేరుగా ఫోన్ చేయండి అని ప్రజలకు తెలిపారు. మీ గ్రామంలో రెవిన్యూ పోలీస్ అధికారులు ఉన్నారని, నాయకర్ తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంత రావు తదితరులు ఉన్నారు.

### దిగువ ప్రాంత ప్రజలు

## అప్రమత్తంగా ఉండాలి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారి గూడెం కేకేఎం ఎర్రకాలువ ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది.జలాశయం పూర్తి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 82.36 మీటర్ల కు చేరుకుంది. ఇన్ ప్లో 800 క్యూ సెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు డిఈ కె.సునీత పర్యవేక్షిస్తున్నారు.దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు.

# శ్రీ నూకాలమ్మ ఆలయానికి పంచలోహ ఉత్సవ మూర్తి విగ్రహం





బహూకరించిన మేకా సింహాద్రి దంపతులు

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** పట్టణంలోని శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు),ఆలయ కమిటీ చైర్మన్ రొంగల నాగేశ్వరరావులతో కూడిన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయఅభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయి. కార్తీక మాసం ఉత్సవాలు వైభవంగా నిర్వహించటానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమృత బాణ నర్మద లింగేశ్వర స్వామి వారికి సుమారు రూ.50 వేలు విలువగల పంచలోహాలతో ఉత్సవ విగ్రహాన్ని చేయించి,పట్టణ ప్రముఖులు మేకా సింహాద్రి,సత్యవతి,మేకా బాల సుబ్రమణ్యం, రాజేశ్వరి దంపతులు సోమవారం ఆలయానికి సమర్పించారు.దాతల కుటుంబ సభ్యులు ఉత్సవ మూర్తికి కార్తీకమాసంలో మొదటి సోమవారం మొట్టమొదటి పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఈమని శశి కుమార్ మాట్లాడుతూ పంచలోహాలతో చేసిన ఉత్సవ మూర్తుల ప్రాశస్త్యాన్ని వివరించారు.

ఆలయ కమిటీ వారు దాత సింహాద్రి కుటుంబ సభ్యులను ఆలయం మర్యాదలతో ఘనంగా సత్కరించి వారి ఔన్నత్యాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిటికెల రాంబాబు,పోలుపర్తి రాము,గాలినూకరాజు, పలువురు పట్టణ ప్రముఖులు, మహిళా కమిటీ, సేవా బృందం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ చెన్నారావు ఆధ్వర్యంలో ఆడమిల్లి బ్రిడ్జి వద్ద రాళ్ల తొలగింపు



**కామవరపుకోట,మేజర్న్యూస్:** మొంథా తుఫాన్ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మండలంలో అధికారులు అందరూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సోమవారం ఎస్సై చెన్నారావు మండలంలో తుఫాన్ ప్రభావం ఎలా ఉండబోతోంది. అన్న దానిపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయడంతోపాటు అలెర్ట్గా ఉన్నారు.ఈ క్రమంలోనే ఏలూరు - జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిపై ఆడమిల్లి వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు కింద తూరల్లో రాళు పేరుకుపోవడంతో దగ్గరుండి మరీ వాటి తొలగింపు పనులు పర్యవేక్షించారు. భారీ వర్షానికి నీటి ప్రవాహానికి రాళ్లు అడ్డు లేకుండా ఉండేందుకే జేసీబీ సాయంతో వాటిని తొలగించి ముందు జాగ్రత్తలు తీసుకున్నట్టు ఎస్సై చెన్నారావు తెలిపారు.

## ఎంపీ చొరవతో సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత




**కొయ్యలగూడెంరూరల్,మేజర్న్యూస్:** ఇటీవల అనారోగ్యానికి గురైన కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన నాటకశాల నాగేశ్వరరావు,తోట శివ రామకృష్ణ , ఇరువురు సుస్తి చేసి చికిత్స అనంతరం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా స్థానిక తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ చొరవతో పార్లమెంట్ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సహాయనిధికి ఆర్జి చేసుకోగా ఎంపీ కృషితో ఇరువురికి 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయ నిధి చెక్కులు ఎంపీ ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు సహాయం నిధి చెక్కులు సమస్య వివరించిన తదుపరి రోజుల వ్యవధిలో ఆపన్న హస్తం సహాయ నిధి చెక్కులు రావడానికి అహర్నిశలు కృషి చేసిన పుట్ట మహేష్ యాదవ్కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఆరేటి ఏసుబాబు,జిల్లా టి.ఎన్.ఎస్.ఎఫ్.అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ కుమార్,తెలుగు యువత మల్లిపూడి చిట్టిబాబు, జనసేన నాయకులు బజారు తేజ, తదితరులు పాల్గొన్నారు.

# 35 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు



**ఏలూరు, మేజర్ న్యూస్ :** కర్నూలు రోడ్డు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఏలూరు జిల్లా రవాణా శాఖ అధికారులు మూడవ రోజు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం తెల్లవారుజామున పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 35 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు . టాక్స్ లేకుండా నడుపుతున్న నాలుగు బస్సులను సీజ్ చేశారు ఈ మేరకు వివరాలను ఏలూరు డిటిసి షేక్ కరీం వెల్లడించారు.

# గ్రామాల్లో పోలీసు వారి దండోరా

- మీ భద్రత మీ చేతిలోనే ఉంది - ప్రభుత్వ సూచనలు పాటించాలి




**కైకలూరు,మేజర్ న్యూస్ :** తుఫాను బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున ప్రజలందరూ తుఫాను సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కైకలూరు రూరల్ సీఐ తెలిపారు. పోలీసు వారి ఆధ్వర్యంలో రూరల్ గ్రామాలలో తుఫాన్ హెచ్చరికల దండోరా వేయించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతమైన కొల్లేరు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈదురు గాలులతో వర్షం ఎక్కువగా ఉన్నప్పుడు చిన్నపిల్లలు, వృద్ధులు దగ్గరలో ఉన్న చేపల చెరువులు నీటి, గుంతలు, విద్యుత్ తీగల కింద,చెట్లు దగ్గర వెళ్ళనీయకుండా సురక్షితంగా ఇంటిలోనే ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యరీత్యా వృద్ధులకు కావలసిన మందులు ముందుగానే సిద్ధం చేసుకుని వారికి చల్లని గాలి వర్షం తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకుని సురక్షితమైన ప్రదేశంలో ఉండేలాగా చూడాలన్నారు. వైద్య సహాయం అవసరమైతే వెంటనే 108కి కాల్ చేయాలన్నారు. గ్రామాల్లో పశువులను ఎత్తైన సురక్షిత ప్రదేశాలకు తరలించి వాటికి కావలసిన పశుగ్రాసం. నీరు ముందుగానే నిలవ ఉండేలా ఏర్పాటు చేసుకుని, పశువుల మందుల కొరకు పశుసంవర్ధక సిబ్బంది సహాయం కోసం సమాచారం ఇవ్వాలన్నారు.అత్యవసరమైన పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్కి సమాచారం అందించాలని మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది ప్రభుత్వ సూచనలు పాటించాలని రూరల్ సిఐ రవికుమార్ కోరారు.

## మొంథా తుఫాన్ తీవ్రతకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కైకలూరు రూరల్ సిఐ వి రవికుమార్



**ముదినేపల్లి,మేజర్ న్యూస్:** మొంథా తుఫాన్ తీవ్రత దాల్చక ముందే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు రూరల్ సిఐ వి రవికుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి , యస్.పి ప్రతాప్ కిషోర్ , డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు తుఫాన్ తాకిడికి ప్రజలు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలో విలేకరుల సమావేశంలో వివరించారు. ప్రజలు రేకులషెడ్లు , పూరిపాకలు , శిబిలావస్థకు చేరుకున్న గృహాలు , చెట్లు , విద్యుత్ స్తంభాలు, చెరువులు , కాలవగట్ల సమీపాలలో నివాసముంటు న్నవారు సురక్షితమైన ప్రాంతాల్లో తరలివెల్లాలని సిఐ సూచిం చారు. అత్యవసర పరిస్థితుల్లో బయటికి రావాలని తుఫాన్ ప్రభావంలో ఏమైనా అత్యవసర పరిస్థితుల్లో 112 ,1077కు ఫోన్ చేసి సహాయం పొందాలని తెలిపారు.

## 4 కుటుంబాలకు పునరావాస కేంద్రంలో వసతి భోజన ఏర్పాట్లు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు,ముందస్తు చర్యలలో భాగంగా మొంథా తుఫాన్ నేపథ్యంలో గ్రామంలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ఇళ్లను గుర్తించి ముందస్తు చర్యలలో భాగంగా 4 కుటుంబాల సభ్యులను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు దేవస్థానం వారి ద్వారా భోజనాలు ఏర్పాటు చేశారు.మండల స్పెషల్ ఆఫీసర్ ముక్కంటి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, మండలం ఇంచార్జ్ పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస్,మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, రెవిన్యూ ,వైద్య ఆరోగ్య, అంగన్వాడి, సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాను నేపథ్యంలో డీఎల్డీవో,తహసీల్దార్ బృందం పర్యటన





**భీమడోలు,మేజర్న్యూస్:** మొంథా తుఫాను సూచనలు నేపథ్యంలో సోమవారం భీమడోలు మండల గ్రామాల్లో ఏలూరు డీఎల్డీవో లక్ష్మీ, భీమడోలు తహసీల్దార్ బీ రమాదేవి,ఎంపీడీఓ పద్మావతిదేవి పర్యటించారు.ఈసందర్భంగా పొలసానిపల్లి, భీమడోలు, వడ్లపట్ల, నరెడ్లగూడెం, పూళ్ల అలాగే మండలలోని కొల్లేరు, డెల్టా, మెట్ట ప్రాంతాల్లో డీఎల్డీవో తహసీల్దార్ బృందం పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే స్థానికులకు తుఫాను హెచ్చరికలు నేపథ్యంలో పలు సూచనలు చేస్తూ వారిని అప్రమత్తం చేసారు. డ్రైన్లను పరిశీలించారు.

భారీ కటౌట్లను తీయించారు. ఈ సంద ర్భంగా తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ 'మొంథా తుఫాన్' ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరి కల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీవ్రగాలు లు, భారీ వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లోని వ్యక్తులను, లోతట్టు ప్రాంతాలవారు అప్రమత్తంగా ఉండాలని, తీవ్రగాలులు సమయంలో ప్రజలు ఇంటినుంచి బయటకు రావద్దని ఇప్పటికే మండల గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు వివరించారు. మండల ఆర్ఐ జగన్నాథం, వీఆర్వోలు వినయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే అవినీతి బయట పెడతా జనసేన నేత బాబీ



**కైకలూరు,మేజర్‌న్యూస్:** కైకలూరు నియోజకవర్గంలో 2014లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చిన్న, చిన్న నాయకులను కొట్టించటం, అక్రమ కేసులు పెట్టించి,అవినీతి ఆరోపణలు ఎన్నో ఉన్నాయని వాటి నన్నిటిని బయటకు తీసి జైలుకు పంపడం ఖాయమని, కొల్లి వరప్రసాద్ (బాబి) పేర్కొన్నారు. కైకలూరు దానగూడెంలో దళితుల పై సోమవారం కైకలూరులోని కంఫర్ట్ ఇన్ హోటల్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కొల్లేటికోటలో నాఇంటిని కూల్చి నన్ను అనేక ఇబ్బందులు పెట్టారని అన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో అందరికీ పెద్ద దిక్కు అయినటువంటి మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విటల్ రావుని కైకలూరు పంచాయతీలో అవమానపరచి కాపు సామాజిక వర్గానికే ద్రోహం చేశావున్నారు. క్యాట్ ఫిష్ వ్యాపారంలో ఎన్నో మోసాలు చేసి ఆక్వా మేత కంపెనీల వాళ్లకి డబ్బులు ఇవ్వకుండా మోసం చేయలేదా అని అన్నారు. పోలీస్ స్టేషన్లో తన అనుచరులతో నువ్వు నీ కుమారులు ఎన్నో దారుణాలు చేసి కొల్లేటికోట పెద్దింట్లమ్మ అవినేటి మండపం నిర్మాణంలో దాదాపు రూ.9 కోట్లు వసూలు చేసింది, ఆ డబ్బులు ఎవరిచ్చారో అవినీతి ఎవరు చేసారో బయటికి తీస్తానని అన్నారు. కైకలూరు జగనన్న కాలనీలో కోట్లు అవినీతి చేసి నేను నిజాయితీపరుడని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ నాయకుడు, ఎస్సీ నాయకులను తిట్టించి కొట్టించింది నువ్వు కాదా ముంగర నరసింహారావుకి వడ్డీ కార్పొరేషన్ పదవి లేకుండా చేసిందినువ్వు కాదా ! నువ్వు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అవినీతి పై స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంక్వయిరీ వేయించి నిన్ను జైలుకు పంపడం ఖాయమని తెలిపారు.

# తుఫాన్ పై అప్రమత్తంగా ఉండండి : లయన్ పేరిచర్ల



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:**ఉభయ తెలుగు రాష్ట్రలని భయపెడుతున్న మొంతా తుఫాన్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్ పర్సన్ విజ్ఞప్తి చేసారు. 27 వ తారీఖు నుండి 30 వతారీకు వరకు ప్రభుత్వ అధికారులు సూచనలు మేరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని అత్యవసరం ఉంటేనే బైట తిరగాలని తాడేపల్లిగూడెం డైమండ్స్ పేరిచర్ల ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలు తరుపున విజ్ఞప్తి చేసారు పడబడిన కట్టడాలులో నివసించే వారు జాగ్రత్తలు పాటించాలని అలానే పశువులు ప్రాణులు పట్ల జాగ్రత్తలు పాటించాల్ని వ్యాధులు ప్రభరిల్ల కుండా కాచిన నీటిని తాగాలని విజ్ఞప్తి చేసారు కార్తీక మాసం సందర్భంగా నది.సముద్రం. కాలువ స్నానాలకు వెళ్ళవద్దని, తుఫాన్‌ని ఎదుర్కొంటున్న ప్రభుత్వం యంత్రాంగంకు అధికారులుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు యువత సహకారం అందించాలిన్నారు పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తో పాటు మద్దుకూరి మెహర్ ప్రసాద్.కోటి విజయ్ కిషోర్.బదుగు చంద్ర శేఖర్ కాళ్ళ గోపికృష్ణ.చెన్నారెడ్డి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొంధా తుపాను ప్రభావంతో నేలకొరిగిన వృక్షం తొలగింపు



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** మొంధా తుఫాను హెచ్చరిక ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా స్థానిక శాసన సభ్యులు మద్దిపాటి వెంకట రాజు,రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, ఆదేశాల మేరకు మండలంలోని రామ సింగవరం గ్రామంలో మెయిన్ రోడ్డుపై ఉన్న ఒక పెద్ద ఎండి పోయిన వృక్షం కరెంటు వైర్లు, నిత్యం రద్దీగా ఉన్న ప్రదేశం మధ్యలో ఉంది అని గ్రామ ప్రజలు తెలిపారు. వెంటనే విద్యుత్ శాఖ ఏఇ సోమేశ్వరరావు తమ సిబ్బందిని రామసింగవరం లైన్మెన్ లక్ష్మణరావు ద్వారా టీమ్‌ను ఏర్పాటు చేసి,పంచాయతీ సెక్రెటరీ హరికృష్ణ సహకారంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందుగానే వృక్షాన్ని తొలగించారు.

# తుఫాన్ ముప్పు నుండి ప్రజల రక్షణకు చర్యలు : ఎమ్మెల్యే బడేటి





**ఏలూరు,మేజర్ న్యూస్:** ముంచుకొస్తున్న తుఫాన్ ముప్పు నుండి ప్రజల్ని రక్షించే విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగానే నగరానికి ప్రధాన సమస్యగా మారిన డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నామని పేర్కొన్న ఆయన,,, ప్రజలు డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వంటివి వేయవద్దని సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావం సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సారథ్యంలో నగరంలో ముందస్తు చర్యలను వేగవంతం చేశారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోన్ని రోడ్లన్నీ ముంపునకు గురయ్యేందుకు కారణమవుతోన్న ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు ప్రక్రియను నిర్వహించగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నగరంలోని మురుగునీరు, వర్షపునీరు పారుదలకు ప్రధానమైన జాలిపూడి డ్రైనేజీకి అనుసంధానంగా నగరంలో నుండి వెళ్లే నవాబుపేట బరేల్ గ్రౌండ్ వైపు ఉన్న డ్రైనేజీ, దెయ్యాల తూము డ్రైనేజీ, డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం వద్ద ఉన్న డ్రైనేజీ, టీవీఎస్ షోరూం వద్ద ఉన్న డ్రైనేజీల్లో ఈ పనులను పారిశుద్ధ్య సిబ్బంది అలాగే క్రేన్‌లు, ట్రాక్టర్లతో నిర్వహిస్తూ వస్తున్నారు. జోరువర్షంలో సైతం ఆ పనులను పరిశీలించిన ఆయన అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎట్టిపరిస్థితుల్లో పదేపదే ముంపు సమస్య పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే చంటి ఆదేశించారు.ఆయన వెంట ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్,కో –ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి,ఎంఈ సురేంద్రబాబు, ఏపీ ఎన్జీవోస్ నాయకులు చోడగిరి శ్రీనివాసరావు,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జులు తదితరలు పాల్గొన్నారు. ముందుస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఇరిగేషన్ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఇసుక బస్తాలను నింపుతున్న ప్రక్రియను ఆయన స్వయంగా పర్యవేక్షించారు.

## కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి దాకరపు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం,శ్రీ అమృతేశ్వర స్వామి వారి దేవస్థానం ,శ్రీ బాలాజీ మఠం భూముల్లో కౌలు రైతులకు గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం మంజూరు చేశారని ఈ ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం అందలేదన్నారు. చట్టబద్ధత చేసి కౌలుదారులుగా గుర్తించి వారికి పంట రుణాలు , సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వాలన్నారు. తుఫాన్ సమయంలో మురుగు,పంట బోదెలను బాగు చేయడానికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలన్నారు. ఈ మేరకు డిప్యూటీ తహసిల్దార్ పవన్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

## అధికారుల సూచనలు పాటిస్తే పంట నష్టాన్ని తగ్గుముఖం – వ్యవసాయ అధికారి పోసారావు



**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** కురుస్తున్న వర్షాలకు పంట నష్టం రాకుండా నివారణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని తద్వారా పంట నష్టాన్ని తగ్గించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ పోసా రావు తెలియజేశారు . మండల పరిధిలో ఉన్నటువంటి గ్రామాలలో రైతులను కలుస్తూ తగు సూచనలను, సలహాలను, అందజేస్తూ పొలాలను సందర్శి ంచారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మంథ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న నేపథ్యంలో వరి, పొగాకు , మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. పొలములో నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని తెలియ జేశారు. వీస్తున్న గాలులకు వరి పంట నేలకు ఒరిగినట్లయితే ఉప్పు ద్రావణంతో పిచ్చిగారి చేయాలని రైతులకు తెలిపారు. వర్షా ప్రభావంతో పంట దెబ్బతింటే అధికారుల దృష్టికి తెలియపరచాలని ప్రతి ఒక్కరూ అధికారుల సలహాలను తప్పక పాటించాలని వారికి తెలియజేశారు.

## తుఫాన్ ప్రభావంతో ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు



**పెదవేగి,మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావం వల్ల పెదవేగి మండలంలోని ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టడం జరిగిందని మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల తాసిల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ గ్రామాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ తుఫానుకు సంబంధించి రెవెన్యూ, పోలీసు,వైద్య ,సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండి తమ సేవలను అందిస్తారని, ఎవరికైనా ఎటువంటి అవసరం ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసిన యెడల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎస్ డి భ్రమరాంబ,ఎంపీడీవో రవికుమార్, ఎస్సై రామకృష్ణ, ఎంఈఓ అనిల్ కుమార్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ పట్ల అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**– జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్**

**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాలు అయిన పెద్దమైన వానిలంక, వేముల దీవి,బియ్యపుతిప్ప, చిన్నమైనవానిలంక, పాతపాడు, కేపి పాలెం గ్రామాలలో జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సముద్ర అలల ఉధృతిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన కంట్రోల్ రూమ్ కు సమాచారమును అందించాలని అన్నారు. అలాగే మత్స్యకారులు సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తీరంలో అగ్నిమాపక, ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తీరందాటే సమయంలో భారీ వర్షాలతో పాటు వేగముగా గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు బయటకు రాకుండా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో సురక్షితముగా ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,ఆర్డీవో దాసిరాజు నరసాపురం మండలం వేములదీవి పడమర చినమైన వానిలంక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న నల్లి క్రీక్ వంతెనను పరిశీలించారు.

ఈ సందర్భంలో జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, తహసిల్దారులు ఐతం సత్యనారాయణ, రాజ్ కిషోర్, కనకరాజు, ఎంఎస్ పాజిల్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావద్దు





**– భీమవరంలోని పలు ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి**

**భీమవరం,మేజర్న్యూస్ :** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం భీమవరంలోని పలు ప్రాంతాలను సందర్శించి జలవనరులు, మున్సిపల్, తదితర శాఖల అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం కూడా పాల్గొన్నారు. తొలుత మెంటే వారి తోటలోని మినామికోడు మురుగు కాలువ వద్ద షట్టర్లను, నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం బివి రాజు సెంటర్ నందు యనమదుర్రు డ్రైయిన్ బ్రిడ్జి పై నుండి ప్రవాహ వేగాన్ని గమనిస్తూ ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. గట్లు బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం బ్యాంక్ కాలనీ బిఎంకే రైస్ మిల్ ప్రాంతంలో యనమదుర్రు కట్ట ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భీమవరం అర్బన్ ప్రాంతంలోని దుర్గాపురంలో వర్షపు నీరు ఎక్కువగా వస్తే పునరావాస కేంద్రానికి తరలించేందుకు భీమవరంలో కూడా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్డీవోను ఆదేశించినట్లు తెలిపారు. భీమవరం డివిజన్ సంబంధించి భీమవరం రూరల్లో మూడు, కాళ్లలో ఒకటి, ఆకివీడులో ఒకటి, భీమవరం టౌన్లో ఒకటి మొత్తం ఆరు పునరావస్తు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు నేటి నుండి మూడు రోజుల వరకు అత్యవసర మైతే తప్ప బయటకి రావద్దు అని, నదీ తీరం సముద్ర తీరం ప్రాంతాలకు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ అవసరమైన చోట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు చేయడం జరుగుతుంది అని తెలిపారు. కార్తీక మాసం స్నానాలకు ఎవరు సముద్రం, నదీ ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ఏదైనా ఇబ్బందులు ఎదురైతే వెంటన సంబంధిత పోలీస్ అధికారులకి సమాచారాన్ని అందించాల న్నారు. ఈ సందర్భంలో భీమవరం ఆర్డీవో కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎడ్యుకేషన్ శాఖ అధికారి సత్యనారాయణ, ఎ.ఇ వెంకటేశ్వర రావు, మున్సిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి, సహాయ మున్సిపల్ కమిషనర్ బి. రాంబాబు, తదితరులు ఉన్నారు.

# మోటార్ బైక్ చోరి కేసులో ముగ్గురు అరెస్ట్

**– 18 బైకులు 1 సెల్ ఫోన్ స్వాధీనం**



**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన పలు మోటార్ బైకులు ఒక సెల్ ఫోన్ను పోలీస్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. కైకలూరు రూరల్ సిఐ వి రవికుమార్ అరెస్ట్పై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ ,కైకలూరు, తాడేపల్లి ,అజిత్ సింగ్ నగర్, కోరుకొల్లు , దేవపూడి , ముదినేపల్లి ప్రాంతాల్లో విజయవాడ అరండల్ పేటకు చెందిన జలసూత్రం సాయి సురేష్ కుమార్ 28, సిసిఐఎల్ విజయవాడ అరండల్ పేటకు చెందిన వ్యక్తి , ముదినేపల్లి మండలం ప్రొద్దువాకకు చెందిన యండూరి జీవన్ రాజు 23 సోమవారం ఉదయం కొత్తపల్లి కాలనీ దేవపూడి రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా కొచ్చర్ల వైపు నుండి మోటార్ బైక్ పై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండడాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే ఎస్ఐ వివిఎస్ వీరభద్రరావు సిబ్బందితో వెంటపడి వారిని పట్టుకున్నారు. వీరిని విచారించగా సుమారు 18 బైకులు , 1 మొబైల్ ఫోన్ చోరీ చేసినట్లు అంగీకరించారు. వీటి విలువ సుమారు.10 లక్షల 55వేలు. మీరు దొంగతనం చేసిన వాహనాలను ప్రొద్దువాక గ్రామంలో కుర్మా సుధాకర్ 37 వద్ద దాచినట్లు వెల్లడించగా అతని వద్ద స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించి ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారిని కోర్టుకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## రూ.50 లక్షల సిఆర్ఎంఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ మహేష్





**ఏలూరు,,మేజర్న్యూస్ :** ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించిన ఎంపీ ప్రజల నుండి వచ్చిన వినతులు స్వీకరించారు. సమస్యలను సావధా నంగా విన్న ఎంపీ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆనంతరం వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న 68 మంది లబ్ధిదారు లకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.50,15,862 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన ఎంపీ,వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సమస్యలతో వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించడానికి ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## వాటికన్ జూబ్లీ వేడుకల్లో ఏలూరు ఆర్సిఎం పీఠం అధినేతలు



**ఏలూరు,మేజర్న్యూస్:** ఏసుక్రీస్తు 2025 జయంతి వేడుకలను మహా జూబ్లీ ఉత్సవంగా వాటికన్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏలూరుపేట ప్రతినిధులుగా వికార్ జనరల్ బాల ఛాన్సర్ రెవరెండ్ ఫాదర్ ఇమ్మానుయేల్ భీమవరం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ స్టాలిన్ ఏలూరు పీఠాధిపతిఆదేశాల మేరకు హాజరయ్యారు. మూ డు రోజులు పాటు జరిగే ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వేడుకల్లో దాదాపు 2000 మంది ప్రతినిధులు హాజరవుతారు. పోపు లియోతో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొనడం తమ అదృష్టమని వికార్ జనరల్ బాల,చాన్సలర్ ఇమ్మానుయేల్ ,ఫాదర్ స్టాలిన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## అనర్హుల ఇళ్ల స్థలాలు తొలగించాలి జిల్లాలో జర్నలిస్టులకు ఇవ్వాలి

**మంత్రి పార్థసారథికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి వినతి**



**విజయవాడ/టి.నర్సాపురం, మేజర్ న్యూస్:** రాష్ట్రగృహనిర్మాణ, ప్రజాసంబంధాల మంత్రి కొలుసుపార్థసారథిని మాజీ శాసన మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు తో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా బిసి విభాగాల కో- ఆర్డినేటర్ కొండపల్లిరవి విజయవాడలోని వారి నివాసంలో కలుసుకున్నారు.గతంలో 2019 నుండి 2024 వరకు వైసిపి ప్రభుత్వంలో ఇళ్ళు మంజూరు కాగా కొంతమంది నిర్మాణాలు చేసుకోలేదని, అలాగే వైసిపి స్థానిక నాయకులు ఒకరి పేరుమీద ఇళ్ళు మంజూరు అయితే ఇంకొకరికి అవి కేటాయించి అక్రమంగా నిర్మాణాలు జరిపారని మంత్రికి తెలిపారు. దానివలన ఇప్పుడు గృహాలకు ఆన్లైన్ చేసుకుంటుంటే గతంలోనే మీకు మంజూరు అయినట్టు చూపించడం వలన నిజమైన నిరుపేద లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని, వాటి విషయంలో తహసిల్దార్ లకు ఆదేశాలు ఇచ్చి విచారణ జరిపి వారి పేర్లు ఆన్లైన్ జాబితా నుంచి తొలగించి నిజమైన నిరుపేద లబ్దిదారులకు ఆన్లైన్ చేసి గృహాలు మంజూరు చేయాలని రవి కోరారు. అదే సమయంలో గతంలో జగనన్న ఇళ్ళ పేరుతో వైసిపి నాయకులు అనర్హులకు ఇంటి స్థలాలు కేటాయించారని, వాటిమీద విచారణ జరిపి అవి పేదలకు అందజేయాలని, సమాజంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వుండి ఏలాంటి సమయంలో అయినా న్యూస్ సేకరించే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరగా మంత్రి వెంటనే స్పందించారు. ఏలూరు కలెక్టర్ తో మాట్లాడి తీవ్ర తుఫాను హెచ్చరికలు వున్న నేపథ్యంలో సమీక్షలు అయినవెంటనే దీనిమీద దృష్టి పెట్టాలని ఆదేశాలు జారిచేయడం జరిగిందని వివరించారు.